# కాబూలీవాలా *

రచన: శ్రీ కలగర్ల నరసింహమూర్తి

మా ఐదేళ్ల అమ్మాయి మినీ ఉంది చూసారూ, ఒక్క క్షణంకూడా నిశ్శబ్ధంగా కూర్చోలేదంటే నమ్మండి. వట్టి వాగుడుకాయ. తన జీవిత కాలమంతటిలోనూ, ఒక్క క్షణాన్నికూడా 'నిశ్శబ్ధం' అనే పదంకోసం మా మినీ వినియోగించదని నా నమ్మకం. పాపం వాళ్లమ్మ మాత్రం, ఆ వాగుడును అరికట్టాలని విశ్వప్రయత్నం చేస్తుండేది. నేను మాత్రం కిమ్మనకుండా ఉండేవాణ్ణి. ఎందుకంటే మా మిని నిశ్శబ్ధంగా కూర్చుంటుందంటే, అది ప్రకృతి విరుద్ధమైన క్రియ అని నా అభిప్రాయం. పైగా, అటువంటి నిశ్శబ్ధాన్ని నేను భరించలేనుకూడా. అందువల్ల మినీతో మాట్లాడుతున్నప్పుడల్లా, నేనూ వాగుడుకాయలా వాగేవాణ్ణి.

ఒకనాటి సుప్రభాతం నేను నా కొత్త నవలలోని పదిహేడో అధ్యాయం వ్రాయటంలో ములిగి ఉండగా, మా మినీ రామభాణంలా పరుగెత్తుకొనివచ్చి 'నాన్నా! నాన్నా! మన నౌకరీవాడు రామదయాల్ లేడూ? వాడు కాకిని చూసి కవ్వా, కవ్వా అంటున్నాడు. వాడికి కాకి పేరుకూడా సరిగ్గా తెలీదు. వాడికి ఏమిటో తెలియదు కదూ?' అంది.

మా భాషకు, రామలాల్ భాషకు గల తేడా ఏమిటో నేను ఇంకా చెబుదామనుకుంటున్నంతలోనే మా మినీ తిరిగి పెద్దగా అరుస్తూ 'నాన్నా! నువ్వేమంటావు నాన్నా? మన భోలా అంటాడు కదా, మబ్బుల్లో ఓ పెద్ద ఏనుగు ఉందట! ఆ ఏనుగు తన తొండంతో నీళ్లు ధారలుగా చిమ్ముతుందట. ఆ నీళ్లే వర్షంగా కురుస్తున్నాయట! అవునా, నాన్నా!' అంది.

నేను ఆలోచిస్తూ, ఏదో చెబుదామని తిరిగి నోరు తెరిచేటంతలో 'నాన్నా! నాన్నా! అమ్మ నీకేమవుతుంది నాన్నా!' అంది మినీ.

నా ముఖం ఆ ప్రశ్నతో మాడిపోయింది. 'మినీ! వెళ్లు. వెళ్ళి భోలాతో ఆడుకో. నాకు బోలెడంత పని ఉంది' అన్నాను.

నేను నా గదిలోని కిటికీద్వారా చూస్తే, అవతలి రోడ్డు కనిపిస్తుంది. మినూ, నా టేబిల్ కాళ్ళముందు కూర్చొని, ముడుకులమీద గడ్డం పెట్టుకొని, వీధివంక చూస్తోంది. నేను నా నవలలోని పదిహేడు అధ్యాయం రాయటంలో పూర్తిగా ములిగిపోయాను. కథానాయకుడు ప్రతాప్ సింగ్, కథానాయకి కాంచనలతను తన బాహువుల మధ్య చిక్కించుకొని, మూడో అంతస్తు మేడ యొక్క కిటికీలోనుండి తప్పించుకొని వెళ్ళిపోబోతున్నాడు. అకస్మాత్తుగా మినీ తన ఆటల్ని ఆపి, కిటికీ దగ్గరకు వెళ్ళి బిగ్గరగా 'కాబూలీవాలా! కాబూలీవాలా?' కేకలు పెట్టింది. వీధిలో రోడ్డుమీద, నిజంగానే ఒక కాబూలీవాలా మెల్లగాపోతున్నాడు. వాడు మిగతా కాబూలీవాళ్ళకు మల్లే వీడుకూడా, వదులైన కమీజు సెరాయి వేసుకున్నాడు. ఒక పెద్ద తలపాగా పెట్టుకున్నాడు. వీపుమీద ఒక పెట్టిని పెట్టుకొని మోస్తున్నాడు. ద్రాక్షపళ్ళున్న పెట్టెల్ని చేత్తో పట్టుకున్నాడు.

వాణ్ణి చూడగానే మా అమ్మాయికి ఎలా ఉంటుందో చెప్పలేనుగానీ, వాణ్ణి చూడగానే, అది పెద్దగా పిలవడం మాత్రం ప్రారంభించింది. 'చావొచ్చిందిరా బాబు! ఈ కాబూలీవాలాగాడు, ఇంట్లోనికి వస్తాడు. ఇహ, నా పదిహేడో అధ్యాయం ముగిసినట్టే!' అని విసుక్కున్నాను నేను. అదే క్షణంలో ఆ కాబూలీవాలా, వెనక్కి తిరిగి మా పాపాయివంక చూసాడు. ఎప్పుడైతే వాడి చూపు తనమీద పడిందో, మా మినీ పరుగులుతీస్తూ రక్షణకోసం అమ్మదగ్గరకు వెల్లిపోయి మాయమయింది. మా మినీకి ఒక గుడ్డి నమ్మకముంది. ఆ కాబూలీవాలా దగ్గర ఉన్న పెద్ద సంచీలో తనలాంటి పాపాయిలు ఇద్దరు ముగ్గురు ఉన్నారని మా మినీ నమ్మకం. ఇంతట్లో ఆ కాబూలీవాలా, మా గుమ్మం ఎక్కుతూ, నావంక చూసి చిరునవ్వు నవ్వాడు.

నా కథానాయకుడు, కథానాయకి బ్రతుకును అలానే వదలిపెట్టి, మా మినీ ఆ కాబూలీవాలాను ఇంటికి పిలిచింది కాబట్టి, ఏదో ఒకటి వాడి దగ్గర కొనాలని అనుకున్నాను. నేను వాడిదగ్గర ద్రాక్ష, కర్జూరం ఇలా

ఎవేవో కొని, వాడితో అబ్దూర్ రహమాన్ గురించి, రష్యావాళ్ళగురించి, ఇంగ్లీషువాళ్ళగురించి, ఫ్రాంటియర్ పోలసీ గురించి మాట్లాడటం ప్రారంభించాను.

కొనుగోలు ముగిసిన తర్వాత వాడు వెళ్ళిపోతూ 'బాబూజీ! పాప ఎక్కడ?' అన్నాడు.

ఈసరికి మినీకి భయం తగ్గి ఉంటుందని అనుకొని వెళ్ళి, నేను వెళ్ళి మినీపిలిచి, కాబూలీవాలా దగ్గరకు తెచ్చాను.

మినీ బెదురుతూ, నా కుర్చీదగ్గర నే నిలబడి, కాబూలీవాలావంక, వాడి సంచివంక బితుకు బితుకుమని చూడసాగింది. వాడు నవ్వుతూ పళ్ళు కాయలు మినీకి అందివ్వబోయాడు. కానీ మినీ వాటిని అందుకోడానికి ఉత్సాహంగా ముందుకు రాలేదు. ఆవిడ అనుమానాలు మరీ ఎక్కువైనాయి కాబోలు, నాకు మరింత దగ్గరగా జరిగి నిలబడింది.

ఈ విధంగా వాళ్లిద్దరూ, మొదటిసారిగా కలుసుకున్నారు.

కొద్ది సుప్రభాతాల తర్వాత, ఒకనాడు నేను గుమ్మం దిగి అలా వెళదామనుకుంటుండగా, నేను ఒక దృశ్యాన్ని చూసి తృళ్ళిపడ్డాను. మా చిట్టి మినీ నా తలుపు దగ్గరనున్న బెంచీమీద కూర్చొని, పెద్దగా నవ్వుతూ, మాట్లాడుతూ ఉంది. మా మినీ పాదాలదగ్గర ఆ గొప్ప కాబూలీవాలా కూర్చొని ఉన్నాడు. మా పాపాయి చెబుతున్నదంతా, వాడు చాలా ఆశక్తితోనూ, శ్రద్ధగానూ, బుద్ధిగానూ వింటున్నాడు. అంత మంచి శిష్యుణ్ణి మా మినీ, తన జీవితకాలంలో ఎక్కడా చూసి ఉండదు. ఆ శిష్యుడిచ్చిన జీడిపప్పు కిస్‌మిస్‌ను చాలా జాగ్రత్తగా మూటకట్టుకుంది మా మినీ.

నేను కాబూలీవాలావంక చూసి చిరునవ్వు నవ్వి "అవన్నీ దానికి ఎందుకు ఇచ్చావ్!" అంటూ జేబులో నుండి ఒక అర్ధ రూపాయి కాసునుతీసి వాడిచేతికిచ్చాను. వాడు, దాన్ని సంకోచం లేకుండా అందుకొని, జేబులో వేసుకున్నాడు.

నేను ఒక గంట తర్వాత, తిరిగి ఇంటికివచ్చి చూసేసరికి, ఆ అర్ధ రూపాయి నాణెం, తన విలువకు రెండింతల విలువగల ఇబ్బందిని తెచ్చిపెట్టింది. ఎందువల్లనంటే, దాన్ని కాబూలీవాల మా మినీకి ఇచ్చాడు. మినూ అమ్మ, మినూ దగ్గర అర్ధరూపాయి కాసు ఉండటం గమనించి ఆశ్చర్యంతో 'ఈ అర్ధ రూపాయి, నీకెక్కడిదే!'' అంటూ ప్రశ్నించింది.

మినూ సంతోషంతో పొంగిపోతూ 'కాబూలీవాలా, నాకిచ్చాడే!' అంది. వాళ్ళమ్మ ఆ మాట విని కోపంతో గజగజలాడిపోతూ, బిగ్గరగా 'కాబూలీవాలా ఇచ్చాడా? ఒసేయ్ మినీ! నువ్వూ, వాడి దగ్గరనుండి తీసుకున్నావే' అంది.

ఆదేక్షణంలో నేను ఇంట్లోనికి ప్రవేశించాను. ఏదో చెప్పి, అప్పటికి ఆరగడను ఆపుచేసాను.

ఆ తర్వాత వాళ్ళిద్దరూ నాకు కలసి కనిపించడం, ఒకటోసారి, రెండోసారి కాదు. కాబూలీవాలా, మినీకు జీడిపప్పు, ద్రాక్షా, పిస్తా ఇచ్చి, భయాన్ని పోగొట్టాడు. ఇప్పుడు వాళ్ళిద్దరూ గొప్ప ఆప్తమిత్రులైపోయారు.

వాళ్ళిద్దరూ ఏవిటేవిటో వింతలు ఒకరితో నొకరు చెప్పుకొని గొప్పగా మురిసిపోతూ ఉండేవారు. మినీ దర్జాగా వాడిముందు కూర్చొని, వాడివంక తీక్షణంగా హుందాగా చూస్తూ, తర్వాత చక్కగా చిన్నగా నవ్వుతూ 'ఓ కాబూలీవాలా! ఓయ్, కాబూలీవాలా! నీ సంచిలో ఏమున్నదోయ్?' అని ప్రశ్నించేది.

కాబూలీవాలా, కళ్ళింత చేసి 'పెద్ద ఏనుగు ఉందమ్మా!' అనేవాడు, అదేమంత పెద్ద ఆశ్చర్యకరమైన విషయం కాకపోయినా, వాళ్లిద్దరూ పకపకమని నవ్వేవారు. ఐదేళ్లైనా నిండని పసిపాప, అంత వయస్సు మీరిపోయిన వానితో అలా స్నేహంగా మాట్లాడుతుండటం చూస్తే, నాకుమాత్రం చాలా ఆశ్చర్యంగా ఉండేది.

కాబూలీవాలా తిరిగి మా మినీవంక చూసి 'ఏం పాపా! నువ్వు మీ మామగారింటికి ఎప్పుడు వెళతావమ్మా!' అని ప్రశ్నించేవాడు.

ఇప్పుడు దరిదాపు ప్రతీ బెంగాలీ కన్యకు తన మామగారిల్లంటే ఏవిటో బాగా కాకపోయినా, కొంత వరకైనా తెలుసు. గానీ మేం మాత్రం కాస్త ఆధునికులం కాబట్టీ, అటువంటి విషయాలగురించి, చిన్న పిల్లలకు అంత తొందరగా తెలియజేయడం మంచిది కాదని మా అభిప్రాయం. అందువల్ల మినీకు మామగారి ఇల్లంటే తెలియదు. అందువల్ల కాబూలీవాల ప్రశ్న వినగానే, మినూకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఐనా

అవి ఆశ్చర్యాన్ని బైటపెట్టకుండానే, మినీ గంభీరంగా 'నువ్వు అక్కడికి వెళ్ళబోతున్నావా?' అనేది.

ఈ కాబూలీవాలాలలో, కొందరు మామగారి ఇల్లు అనేమాటకు రెండు అర్థాలు చెబుతారు. జైలు విషయం తీసుకోండి. ఖైదీలగురించి అక్కడ చాలా జాగ్రత్త తీసుకుంటారు. తిండికోసంగానీ, బట్టకోసంగానీ, మందుల గురించిగానీ ఒక్క కానీకూడా ఖర్చుపెట్టనక్ఖర్లేదు. అందువల్ల జైలునుకూడా మామగారి ఇల్లే అంటారు వాళ్ళు. అదే ఉద్దేశంతో ఈ కాబూలీవాలాకూడా నా కుమార్తె మాటల్ని తీసుకున్నాడు. కంటికి ఎదురుగా లేక ఒక పోలీసువాలాను తలచుకొని "అవునమ్మా! నేను మా మామగారి వీపు వాయగొడతానమ్మా, అక్కడికి వెళ్ళి!' అనేవాడు. ఇదంతా విని, ఆ మామగారికి జరగబోయే సత్కారాన్ని తలచుకొని, మా మినీ పకపకమని విరగబడి నవ్వేది ఆ నవ్వుతో బ్రహ్మాండమైన కాబూలీవాల నవ్వుకూడా జోడింపబడేది.

కాబూలీవాలాను చూస్తున్నప్పుడల్లా, నా హృదయం చివాలున ఎగిరిపోయి కాబుల్‌లో వాలిపోయేది. అక్కడి పర్వత శిఖరాలు, ఇసుకలో నడుస్తూ ఎంతో భారాన్ని మోస్తున్న ఒంటెలు, వాటిపైన కూర్చున్న వర్తక శిఖామణులు, వాళ్ళదగ్గర రక్షణార్థం ఉండే తుపాకులు, బల్లేలు, అవన్నీ నాకు లీలగా కనిపించేవి. కానీ మినీ తల్లి వచ్చి "ఆ కాబూలీవాణ్ణి చేరదీస్తున్నారు. జాగ్రత్త సుమండీ'' అనేసరికి నాకలంతా చెరిగిపోయేది.

మినీ అమ్మ చాలా తొందరపాటు గాభరామనిషి. ఆవిడ, వీధిలో ఏదైనా శబ్దాన్ని విన్నా, లేక ఇంటి వైపు ఎవరైనా కొత్తవాళ్ళు వచ్చినా, దొంగల్నో త్రాగుబోతుల్నో, పాముల్నో లేక మలేరియారోగుల్నో, నల్లుల్నో, గొంగళిపురుగుల్నో చూసినట్లు తృళ్ళిపడి గంతులు వెయ్యడం ప్రారంభించే అలవాటుగలది. ఇన్నేళ్ళై కలకత్తాలో ఉండి అనుభవం గడించినా, ఆవిడకు ఆ భయంమట్టుకూ ఇంకా వదల్లేదు. కాబూలీ

Grams:- "SIVAJITEX" : : Phone: 3616



వాలా గురించి ఆవిడకు చాలా అనుమానాలు కలిగినాయ్. అందువల్లనే జాగ్రత్తసుమండీ, అని నన్ను హెచ్చరించింది.

నేను ఆవిడ భయాన్ని తొలగించాలని మెల్లగా నవ్వగానే, ఆవిడకోపం మరింత రెచ్చిపోయి, ఏవేవో ప్రశ్నలవర్షం కురిపించేది.

'పిల్లల్ని ఎవ్వరూ ఎత్తుకుపోవడంలేదూ?'

'కాబూల్ దేశంలో బానిసత్వం లేదూ?'

'ఏం! ఎద్దులా ఉన్నాడా కాబూలివెధవ! పసిపిల్లను, ఆ సంచిలో వేసుకొని పట్టుకొనిపోతే ఏం చెయ్యగలం? వాడు పట్టుకుపోలేడా, ఏం?'

పట్టుకొనిపోతే ఏం చెయ్యగలం ? వాడు పట్టుకుపోలేడా, ఏం?'

'అబ్బెబ్బే! ఆ పనులన్నీ అసాధ్యం కాకపోయినా, అలా జరగవులే' అనే బోధించడానికి ప్రయత్నించేవాణ్ణి, కానీ మా ఆవిడ అనుమానం, అనుమానంగానే ఉండిపోయింది.

ఏడాదికొకసారి, జనవరిమధ్యలో రహమాన్ అంటే కాబూలీవాల తన స్వంతదేశానికి ప్రయాణం కట్టేవాడు. అందువల్ల జనవరి సమీపించగానే, అతడు చాలా హడావిడిలో, తన బాకీలను వసూలుచేసుకొనేవాడు. ఈ విడుమాత్రం, అంత హడావిడిలోనూ, మినీని చూడ్డానికి రావటంమాత్రం మానేవాడు కాదు. ఏ కారణంచేతనైనా పగటిపూట రాలేకపోతే, సాయంకాలంవేళ తప్పకుండా వచ్చేవాడు. కొత్తవాడెవడైనా చూస్తే మా పాపాయికి, ఆ వయస్సుమీరిన కాబూలీవాలకు ఏవో పూర్వజన్మబంధం ఉందేమో ననిపించకమానదు. పొడుగైన వదులైన దుస్తుల్నిధరించి, మూటలబరువుతో కనిపించే ఆ కాబూలీవాలాను చూస్తే, నాకూ అదే అనుమానం కలిగేది.

ఇంకా కొద్దిరోజులకు కాబూలీవాలా, తన స్వంతదేశానికి వెళతాడనగా, ఒక ఉదయంవేళ, నేను నా గదిలో కూర్చొని ప్రూఫుషీట్లను దిద్దుకుంటున్నాను. వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంది. కిటికీగుండా, సూర్యకిరణాలు వచ్చి, పాదాలకు వెచ్చగా తగులుతుంటే, ఎంతో హాయిగాఉంది. దరిదాపు ఉదయం ఎనిమిది గంటలయింది. రోడ్డుమీద మనుష్యులు ఇటూ అటూ తిరుగుతున్నారు. అకస్మాత్తుగా రోడ్డుమీద ఏదో పెద్ద అరుపు వినబడింది. నేను కిటికీలోనుండి తొంగిచూసాను. కాబూలీవాలా రెహమాన్‌ను, ఇద్దరు పోలీసులు సంకెళ్ళువేసి నడిపించుకొని వెళుతున్నారు, వెనకాలే పెద్ద జనసమూహం, వాళ్ళను అనుసరిస్తూ పెద్దగా అరుస్తూ వెళుతున్నారు. రెహమాన్ బట్టలమీద అక్కడక్కడ నెత్తురుమరకలు ఉన్నాయ్. అందులోని ఒక పోలీసు ఒకచాకును పట్టుకొని నడుస్తున్నాడు. నేను తొందరగా బైటకువచ్చి, ఆ గుంపులోనివారిని ఆపి, ఏమిటి జరిగిందని ప్రశ్నలవర్షం కురిపించాను. ఒకనివద్ద కొంత, ఇంకొకనివద్ద మరికొంత ఈ విధంగా నేను సేకరించిన సమాచారం వివరాలేమిటంటే, పొరుగువాడొకడు రెహమాన్‌దగ్గర ఒక రామాపురం శాలువా కొని బాకీపెట్టాడట. ఆ బాకీవిషయమై ఆ పొడుగువాడు, రెహమాన్ పోట్లాడుకున్నారట. పరిస్థితులు విషమించి, పట్టరాని కోపంతో రెహమాన్, ఆ పొరుగువాణ్ణి చాకుతో పొడిచి చంపేశాడట. చేతికి సంకెళ్ళతో నడుస్తున్న రహమాన్, చచ్చిన ఆ పొరుగువాణ్ణి యింకా ఎన్నో బూతుతిట్లు తిడుతున్నాడు. మా ఇంటి వరండా దగ్గరకు రహమాన్ సమీపించగానే, మా మినీ పరిగెత్తుకొనివచ్చి యధాలాపంగా 'ఓ కాబూలీవాలా, ఓ కాబూలీవాలా' అంటూ ఎలుగెత్తి పిలిచింది. ఆ పిలుపు వినగానే రెహమాన్ వదనంలో నూతనజ్యోతి తళుక్కున మెరిసింది. ఇప్పుడతని భుజందిగువ సంచీలేదు గనుక, మీనూకు ఇప్పుడు ఏనుగుగురించి మాట్లాడే అవకాశం లేకపోయింది. వెంటనే మీనూ తన రెండవప్రశ్నగా, 'ఏం కాబూలీవాలా ? నువ్విప్పుడు మీ మామయ్యగారింటికి వెళుతున్నావా ఏం?' అని అడిగింది. రెహమాన్ పకాలున నవ్వి 'నేనిప్పుడు వెళుతున్నది అక్కడికే పాపా!' అన్నాడు. కానీ ఆ జవాబు మా మినీను ఆట్టే సంతృప్తి కలిగించలేనట్టుంది. బంధించబడిన చేతుల్ని పైకెత్తి 'హా! నేనీ మామను ఇప్పుడే, రెండుముక్కలుగా చేసేవాణ్ణి. కానీ నా చేతులు బంధింపబడ్డాయి!' అన్నాడు కాబూలీవాలా రెహమాన్.

హత్యచేశాడని ఋజువు ఐనందువల్ల రెహమాన్‌కు ఎన్నో సంవత్సరాల ఖైదుశిక్ష విధించబడింది.

కాలచక్రం గిఱ్ఱున తిరిగిపోతూఉంది. రెహమాన్

మా స్మృతిపథంలోనుండి, మెల్లగా తొలగిపోయాడు. మా దినచర్య మామూలుగానే గడచిపోతూఉంది గానీ పాపం ఆ స్వేచ్ఛాజీవి, ఆ ఖైదులో ఎలాంటి నికృష్ట బానిసజీవితం అనుభవిస్తున్నాడోనని ఒక్కసారికూడా మేము తలంచలేదు. ఎంతో సున్నితమైన హృదయంగల, మా మీనీకూడా, తన పాతస్నేహితుణ్ని పూర్తిగా మరచిపోయిందని చెప్పడానికి సిగ్గుపడుతున్నాను. క్రొత్తస్నేహితులు ఆమె జీవితంలో ప్రవేసించారు. ఆమె పెరిగి పెద్దవుతూ, ఆడపిల్లలతో ఆడుతూ పాడుదూ కాలం గడిపేది. ఆమె ఆ స్నేహితురాళ్ళతో యెంతగా కాలం గడిపేదంటే, ఇప్పుడు ఆ అమ్మాయికి తన తండ్రిగదిలోనికి రావటానికికూడా తీరుబాటు చిక్కడంలేదు. అందువల్ల మీనీతో మాట్లాడే అవకాశం నాకు ఎప్పుడోగానీ లభించేదికాదు.

సంవత్సరాలు గడచిపోయాయి. తిరిగి ఆకురాలు కాలం వచ్చింది. ఇప్పుడు మేము మా మీనీ పెళ్ళిచేద్దామని నిశ్చయించుకున్నాం. దసరారోజుల్లో పెళ్ళి జరగబోతూ ఉంది. గిరిరాజపుత్రి పార్వతీమాత, తిరిగి కైలాసానికి వెళ్ళి పరమశివుని చేరుకొనే ఆ రోజుల్లోనే, మా ఇంటిజ్యోతి, మీనీకూడా తన భర్తఇంటికి తరలిపోతుంది. కన్నవారిని కన్నీటివారధిలో ముంచి, నా చిట్టితల్లి తన భర్తదగ్గరకు వెళ్ళిపోతుంది.

ఒకనాటి ఉదయం చాలా ప్రకాశవంతంగా ఉంది. బాగా వర్షాలుపడ్డ తర్వాత, గాలంతా, నిర్మలంగా శుభ్రంచేయబడినట్టు ఉంది. ఆ గాలిని దూసుకొని వస్తున్న సూర్యకిరణాలు, బంగారుకాంతుల్ని వెదజిమ్ముతున్నాయ్. చల్లని వెచ్చని ప్రభాతసమయం. పెళ్ళి బజంత్రీలు మ్రోగుతున్నాయ్. అలా మ్రోగుతుంటే ఎవరో మా శరీరాన్ని చీల్చి, అందులోని గుండెకాయను తీసుకుపోతున్నట్టనిపించింది మాకు. షెహనాయి భైరవి రాగాన్ని ఆలాపిస్తూఉంటే, నానుండి నాచిట్టి మీనూ, దూరముకాబోయే క్షణందగ్గర పడుతున్నట్టు బాధపడుతున్నాను. నా మీనీకి ఆరాత్రే పెళ్ళికాబోతూ ఉంది.

ఉదయంనుండి, మా ఇంట్లో పెళ్ళి హడావిడి జరుగు

మీ వ్యాపారస్తులవద్ద
ఉషా
బనియన్లు
అని గుర్తున్న బనియన్లు
మాత్రమే కావాలని
పట్టుపట్టండి.
మరే ఇతర రకాలూ దీనికి
సరితూగక, మీకు
సంతృప్తినిచ్చేది
నేడు ఇది ఒకటి
మాత్రమే.
USHA KNITTING COMPANY
TRADE MARK
USHA
BANIANS
TIRUPUR
* ఇప్పుడు ధారాళముగా దొరకుచున్నది *

తూనే ఉంది. వీధిగుమ్మంలో రాటలుపాతి పందిర వేశాం. రంగుకాగితాలతో పందిరను అలంకరించాం. ఇల్లంతా నూతన శోభతో ప్రకాశిస్తూఉంది. వస్తున్న వాళ్లు ఇంట్లోకి వస్తున్నారు. వెళుతున్నవారు వెళుతున్నారు. నేను నా గదిలో కూర్చొని పద్దులు చూసుకుంటున్నాను. ఇంతలో యెవరో ప్రవేశించి నన్ను మర్యాదగా సెల్యూట్ చేసి యెదురుగా నిలబడ్డారు. ఆ వ్యక్తి యింకెవ్వరో కాదు. ఒకనాటి కాబూలీవాలా రెహమానే. మొట్టమొదట నే నతన్ని గుర్తుపట్టలేకపోయాను. అతడిప్పుడు సంచిని మొయ్యటంలేదు, పొడుగైన జుత్తు పొట్టిగా కత్తిరించబడింది. ఆనాటి హుందాతనం ఈనాడు అతనిలోలేదు. కానీ అతడు మెల్లగా నవ్వగానే, నే నతన్ని గుర్తుపట్టాను.

'ఎప్పుడోచ్చావు రహమాన్?' అన్నాను నేను.

'నిన్న సాయంకాలం. నేను జైలునుండి విడుదల చేయబడ్డాను' అన్నాడు రెహమాన్. అతని పలుకులు, నా చెవులకు ములుకులువలె సోకినాయ్. తోటిమానవుని హత్యచేసిన క్రూరులతో, నే నింతకు ముందెన్నడూ మాట్లాడలేదు. ఆ విషయం గుర్తుకురాగానే నా హృదయం సిగ్గుతో కుంగిపోయింది. ఎంతగా బాధపడ్డానంటే ఈ శుభదినాన అటువంటివాని ముఖం కనబడకుండా ఉంటే ఎంతో బాగుండేది అనిపించింది నాకు.

'ఇంట్లో శుభకార్యం జరుగుతోంది. అవతల నాకు చాలా తొందరపనులున్నాయ్. నువ్వు ఇంకోనాడు నా వద్దకు రావచ్చునులే' అన్నాను.

గిఱ్ఱున వాడు వెనక్కితిరిగి వెళ్ళిపోబోయాడు. కాని గుమ్మందగ్గరకు వెళ్ళి ఏదో గుర్తుకువచ్చినట్లు వెనక్కితిరిగాడు. నావంక దీనంగా చూస్తూ 'ఒక్కసారి మీనీని, నేను చూడకూడదా బాబూజీ!' అన్నాడు, పాపం! మీనీ ఆనాటిలాగే ఇంకా పసిపాపలాగే ఉందని అతని నమ్మకం. మీనీ తనను చూసి తొందరగా పరిగెత్తుకొనివచ్చి 'ఓ కాబూలీవాలా, ఓ కాబూలీవాలా' అని పిలుస్తున్నట్లు ఆనాటి సంఘటన అతని మనోవీధిలో మెరుస్తూఉంది. ఇద్దరూ కలసి నవ్వుతూ, మాట్లాడుతూ కేరింతలు కొడుతున్నట్లు అతడు ఇంకా ఊహించుకుంటున్నాడు. పాతరోజుల్ని గుర్తుకుతెచ్చుకొని కాబోలు, ఏదో కాగితంలో కొన్ని ద్రాక్షపళ్ళు, కిస్మిస్, చిన్నపొట్లాం కట్టి తెచ్చాడు. తనదగ్గరఉన్న కొంచం సొమ్ముకు వాటిని ఏ పల్లెటూరి వర్తకునికో ఇచ్చి, ఇవన్నీ తెచ్చినట్లున్నాడు.

నేను తిరిగి యిలా అన్నాను, 'ఇంట్లో శుభకార్యం జరుగుతోంది. నువ్వీనాడు యెవరినీ చూడ్డానికి వీలుపడదు.'

ఆ మానవుని ముఖం దుఃఖంతో కృంగిపోయింది. నావంక నిరాశతో ఒక్కక్షణంపాటు చూసి, 'మంచిది బాబూజీ! వెళుతున్నాను. దయ ఉంచండి' అంటూ బైటకు వెళ్ళిపోయాడు.

నాకు చాలా బాధ కలిగింది. రమ్మని తిరిగి పిలుద్దామనుకున్నాను. నా మనస్సు తెలిసినట్లు, అతను గిఱ్ఱున తిరిగి నా దగ్గరకు మళ్ళీ వచ్చాడు. పొట్లాన్ని నాదగ్గర ఉంచి 'పాపాయికోసం, ఏదో ఈ చిన్నబహుమానాన్ని తెచ్చాను. దీన్ని పాపకు అందజేస్తారా బాబూజీ!' అన్నాడు,

నేను వాటిని అందుకొని, ఆ ఖరీదును ఇవ్వబోయాను. కానీ అతడు దీనంగా నా రెండుచేతులూ పట్టుకొని, 'మీరు చాలా దయగలవారు బాబూజీ! నన్ను మరచిపోకండి, అదే పదివేలు. ఈ చిన్నవస్తువుకు, నాకు ఖరీదుమాత్రం చెల్లించకండి. మీకో, చిన్న పాపాయి ఉంది. నా స్వంతదేశంలో, నా స్వంతఇంటిలో నాకూ, ఇలాంటి పాపాయే ఉంది. నా చిట్టితల్లిని, మీ చిట్టితల్లిలో చూస్తూ ఆనందిస్తూ, ఈ పళ్ళను మీ చిట్టితల్లికోసం తెచ్చాను...అంతేగానీ, లాభం సంపాదించాలని కాదు.'

అలా చెబుతూ ... అతడు తన పొడుగైన కమీజు జేబులో చెయ్యిపెట్టి, మురికితో నిండిన ఒక చిన్న కాగితంముక్కను తీసాడు. అతి జాగ్రత్తగా మడత విప్పి, దాన్ని నా టేబిల్ మీద పెట్టి, తన రెండుచేతులతోనూ దాన్ని సాఫుచేసాడు. ఆ కాగితంమీద, ఒక చిన్నపిల్ల అరచెయ్యి ముద్రవుంది. అది గొప్ప ఫోటో కాదు. గొప్ప డ్రాయింగుకాదు. అరచెయ్యి నిండా సిరా రాసి, ఆ చేతిని అద్ది, ఆ చేతిముద్రను ఆ కాగితంమీద వేశారు అంతే! ఆ చేతిముద్ర, ఆ కాబూలీవాలా కుమార్తెది. కలకత్తాకు వచ్చి సరుకులు అమ్ముతున్నంతకాలం, తన స్వంతకూతుర్ని చూసే భాగ్యం

లేక, ఆ అభాగ్యుడు, ఆ కాగితంమీద గల తనకుమార్తె చేతిముద్రను చూస్తూ, తన కుమార్తెను చూస్తున్నట్లు తృప్తిపడేవాడు. ఆ కాగితాన్ని తన హృదయంకంటే పదిలంగా దాచుకున్నాడు.

అకస్మాత్తుగా నాకళ్ళు చెమ్మగిల్లినాయ్. ఆతడు పళ్ళను అమ్ముకొనే ఒక పేద కాబూలీవాలా అన్న మాట ఒక్కక్షణం మరచిపోయాను... కానీ... నేనో... నేను...అతనికంటే నేనుమాత్రం యెందులో గొప్ప. అతడుకూడా నాలాగే ఒక తండ్రి.

ఎక్కడో దూరంగా పర్వతప్రాంతాలలోని ఇంట్లో, దీనంగా తన తండ్రికోసం యెదురుచూస్తున్న ఆ కాబూలీవాలా కుమార్తెయొక్క చేతిముద్రను చూడగానే, నాకు త్వరలో దూరం కాబోతున్న నా చిట్టితల్లి మినీ దీనవదనం యెదురుగా లీలగా కనిపించింది.

మినీని, నా గదిలోనికి పంపమని యింట్లోనికి కబురు చేశాను. ఇంట్లోవాళ్ళు యెన్నో అభ్యంతరాలు చెప్పారు. నేను ఆ అభ్యంతరాలను త్రోసివేశాను. మినీ వచ్చింది. ఎఱ్ఱని సిల్కుచీరను, తన వివాహానికి చిహ్నంగా నా తల్లి ధరించింది. నుదుటిమీద చందనంబొట్టు ప్రకాశిస్తూవుండగా, నా తల్లి అచ్చంగా పార్వతీదేవిలా ఉంది. సిగ్గుతో తలవంచుకొని నా యెదుట నిలబడింది నా తల్లి మినీ.

మినీని చూడగానే, కాబూలీవాలా ఆశ్చర్యంతో ఒక్కక్షణం మూగవాడైపోయాడు. అతడు తన పాత స్నేహాన్ని వెంటనే గుర్తుకు తేలేకపోయాడు. తుదకు యెలాగో అతి కష్టంమీద మెల్లగా నవ్వి 'చిట్టితల్లీ! నువ్వీనాడు మామగారింటికి వెళుతున్నావా, అమ్మా!' అన్నాడు.

కానీ ఈనాడు మినీకి ఆ 'మామగారు' అనే పదానికి అర్థం తెలుసు కాబట్టి, మునపటిలా కాబూలీవాలాకు జవాబు చెప్పలేకపోయింది. అతని ప్రశ్నకు మౌనంగా ఉండిపోయింది మినీ. వధువులా, వదనాన్ని దించుకొని అతని యెదురుగా నిలబడింది మినీ.

కాబూలీవాలా, నా మినీ మొట్టమొదటిసారిగా కలిసినరోజు ఆ సంఘటన నాకు బాగా గుర్తుంది. నాకు చాలా విచారం కలిగింది. మినీ లోనికి వెళ్ళిపోయిన తర్వాత, కాబూలీవాలా దీర్ఘంగా నిట్టూర్పు విడిచి, నేలమీద కూలబడిపోయాడు. తన కుమార్తెకూడా ఈ నాటికి పెరిగి పెద్దదై ఉంటుంది. ఇప్పుడు తను, స్వంత కుమార్తెతోకూడా తిరిగి క్రొత్తవానిలా స్నేహం చేసుకోవాలి. ముఖ్యంగా తను ఆ నాడు చూసిన పసిపాప రూపాన్ని ఈ నాడు తన కుమార్తెలో చూడలేదు. ఈ విషయాలన్నీ అతనికి గుర్తుకు వచ్చినాయ్. ముఖ్యంగా, ఈ ఎనిమిదేళ్ళలోను ఆ పాపాయికి, ఏం జరిగినా ఎందుకు జరగకూడదు ?

వైవాహిక మంగళ వాయిద్యాలు మ్రోగుతున్నాయ్. మెల్లగా సూర్యకాంతి మా చుట్టూ అలముకుంటూ ఉంది. కానీ రహమాన్, కలకత్తాలో ఉన్నాడన్న మాటేగాని, అతని మనసుమాత్రం, అఫ్ఘనిస్థాన్ కొండప్రాంతాలకు పరుగెత్తుకొని పోయింది.

నేనో కరెన్సీనోటును తీసి కాబూలీవాలా చేతికిస్తూ "వెళ్లు రెహమాన్! నీ స్వంత దేశానికి వెళ్ళి నీ కుమార్తెను చేరుకో. మీరిద్దరూ తిరిగి కలియటంవల్ల నీ కుమార్తెకు తిరిగి గొప్ప భాగ్యం కలుగుతుంది" అన్నాను నేను.

ఆ బహుమానాన్ని ఇవ్వటంవల్ల, పెళ్ళిలో నేను కొన్ని ఖర్చుల్ని తగ్గించవలసివచ్చింది. ఎలెక్ట్రిక్ లైట్లు పెట్టించాలనుకున్నాను గానీ, పెట్టించలేకపోయాను, మిలటరీ బ్యాండు తెప్పిద్దామనుకున్నాను గానీ, తెప్పించలేకపోయాను. ఇంట్లోని ఆడవాళ్ళందరూ ఇలా చెయ్యడంవల్ల, కోపంతో గుసగుసలాడుకున్నారు. కానీ నాకు మాత్రం నా కుమార్తె పెళ్ళి ఎంతో శుభప్రదంగా కాంతివంతంగా జరిగినట్లు తోచింది. ఎంతో కాలానికి ఎన్నో ఏళ్ళనుండి తండ్రిని చూడాలన్న కాంక్షతో తండ్రికోసం ఎదురుచూస్తున్న ఒక చిట్టి పాపాయికి నా మూలంగా తండ్రి దర్శనం లభించింది. కుమార్తెను చూడాలన్న కాంక్షతో తపించిపోతున్న ఒక తండ్రికి కుమార్తె తిరిగి కనిపించింది.

ఈ ఒక్క ఊహ, నా హృదయంలో, కోటి వెన్నెల కాంతులను కురిపించింది.